# ఆనంద భరితంగా అమోఘంగా జరిగిన అన్నమయ్య సంకీర్తనోత్సవాలు

ఆ రోజు జూలై 25, 2010, ఆషాఢ పౌర్ణమి. తిథి ప్రకారం గురుపూర్ణిమ పండుగ. అమెరికా తెలుగు వారికి పండుగనాడే అరుదుగా కలిసొచ్చిన ఆదివారం గనుక తెలుగు వారెల్లరూ పిల్లా పాపలతో పట్టు వస్త్రాలు ధరించి తెలుగు దనం ఉట్టిపడేలా దేవాలయ ప్రాంగణానికి విచ్చేసారు.

ఆమెరికా చరిత్రలోనే తెలుగు వారికి సువర్ణాక్షరాలతో లిఖించిదగినదిగా బే ఏరియా తెలుగు సంఘం(బాటా) "శ్రీ తాళ్ళపాక అన్నమయ్య నగర సంకీర్తనోత్సవాన్ని" కాలిఫోర్నియా సిలికాన్ వేలిలోని సన్నివేల్ హిందూ దేవాలయంలో పద్మశ్రీ డా॥ శోభారాజు గారి ఆధ్వరంలో ఘనంగా నిర్వహించింది. నగర వీధుల్లో శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీదేవి మరియు భూదేవి ఉత్సవమూర్తులను మారేపల్లి శాస్త్రి గారి వేద పఠనంతో ఎంతో వైభవంగా, అబ్బుర పడేలా అలంకరించి ఊరేగింపుగా తానా అధ్యక్షులు శ్రీ జయరాం కోమటి గారు రథాన్ని ప్రారంబించి భక్తులందరూ లాగుతూ, 'సిరుత నవ్వుల వాడు సిన్నెక్క', 'తిరుమల గిరిరాయ' అన్నమయ్య గీతాలను శ్రావ్యంగా ఆలపిస్తూ, గోవిందా, గోవిందా అంటూ భజనతో వెళుతున్న తెలుగువారి ఆనందానికి అవధులులేవు. భక్తి పారవశ్యంతో కొబ్బరి కాయలు కొట్టి, పండ్లు వగైరా నైవేద్యంగా సమర్పించి వారి మనస్సులోని కోరికలను నివేదించుకొన్నారు.

డా॥ శోభారాజు గారు కేవలం వారం రోజుల శిక్షణతో విద్యార్థులకు ఐదు  సంకీర్తనలను నేర్పించి వేదికపై రాగయుక్తంగా  పాడించి శ్రోతలను  మెప్పించారు.  గురుపూర్ణిమ సందర్భంగా విద్యార్థులందరూ  పద్మశ్రీ డా॥ శోభారాజుగారిని వేదిక వద్దకు  కరతాళ  ధ్వనులతో  వేడుకగా  గొనివచ్చి  శాలువాతో  సత్కరించారు. డా॥ శోభారాజు గారు తన గురువు అన్నమయ్య అంటూ  ఆమె  వారిని మనన చేసుకొని తన భక్తి ప్రపుత్తులను చాటుకొన్నారు.  అటు పిమ్మట "నమో నమో గణనాథ నమో నమో" అంటూ గణపతి స్తుతితో "అన్నమయ్య సంకీర్తనోత్సవ కార్యక్రమం" ప్రారంభమైంది. ఈ కచేరీలో డా॥ భోభారాజుగారు పలు కీర్తనలని అతి మధురంగా ఆలపించి భక్తుల మనస్సులను దోచుకొన్నారు. ఆమె కీర్తనమిన్నా వివరణ మిన్నా యన్నంతగా కీర్తనల ప్రాశస్త్యాన్ని వివరించారు.  అన్నమయ్య జీవితంలో జరిగిన పలు సంఘటనలు కళ్ళకు కట్టినట్టు వివరించారు.  అన్నింటికి  మించి విశేషంగా ప్రతి కీర్దన చివర ఒక భజనను ఏర్చి కూర్చి  ప్రేక్షకులందరిని మంత్రముగ్దులుగా చేసి ఆ భజనలో గొంతు కలిపి పాడించి ఆ గానామృతాన్ని భక్తులందరూ ఆస్వాదించేలా చేశారు.

మొదట సంస్కృతంలో విరచించిన 'నారాయణతే నమో నమో' సంకీర్తనను పాడారు.  గత **30** ఏళ్ళుగా తెలుగు ప్రజలందరు విని ఆదరిస్తున్న 'అదిగో అల్లదిహె శ్రీహరి వాసము' గీతాన్నిఅత్యద్భుతంగా భావావేశం ఉట్టిపడేలా ఆలపించి అందర్ని ఆకట్టుకున్నారు.'వేడుకొందామా వేంకటగిరి వేంకటేశుని వేడ కొందామ' మరియు అహంకారియైన  సాళువ నరసింహరాయలు  కారాగారంలో అన్నమయ్యను బంధించగా 'ఆకటి వేళల అలుపైన వేళల వేకువ హరి నామమే దిక్కు మరిలేదు' అంటూ వేంకటేశ్వరుని వేడుకొన్న కీర్తనను ఆలపించారు. భక్తులకు కష్టాలను కడతేర్చుతూ, వరప్రసాదియైన శ్రీ వేంకటేశ్వరస్వామి గుణాలను వర్ణిస్తూ అన్నమయ్య రచించిన 'కొండలలో నెలకొన్న కోనేటిరాయడు వాడు' పాట  సబికులను  పరవశంచేసింది. బహుళ ప్రచారం పొందిన  'చాలదా హరినామ సౌఖ్యామృతము తమకు'  మధురంగా  పాడారు. తరువాత 'మా సంగతి  విన్నవించవయ్యా,  వెంకన్నకు  మా  అన్నమయ్యా' అను స్వీయరచనను శోభారాజు గారు పాడారు. ప్రేక్షకుల కోరికపై 'తందనానా అహె,తందనానా భళే' సంకీర్తనను పాడుతుంటే పరవశించి అందు కనుగుణంగా శిరీష బత్తుల  చేసిన  భరతనాట్యం అందర్ని ఆకట్టుకొంది.  ప్రతి రెండవ శనివారం స్వామి సన్నిధిలో  ఊయల సేవలో తను రచించి  పాడిన కీర్తనను  ఆలపించారు.   చివరగా వేంకటేశ్వర మంగళాసానలతో కచ్చేరిని ముగించారు.

దేవాలయ ప్రాంగణమంతా తిరుమలను మరిపించేలా కళకళలాడింది. ఇండియా నుండి ప్రత్యేకంగా వచ్చిన జయకుమార్ ఆచార్య,ఆయ్యప్పరాజు తబల మరియు కీబోర్డు వాద్యాపై సహకారాన్ని అందించగా గాయిత్రీ అవ్వారీ తదితరులు వేదికపై శోభారాజుగారితో స్రుతి కలిపారు. విజయ ఆసూరి వ్యాఖ్యాతగా వ్యహరించిన ఈ కార్యక్రమానికి తానా అధ్యక్షుడు జయరాం కోమటి, తానా గౌరవ సభ్యులు శ్రీ సతీష్ చిలుకూరు, తులసి తుమ్మల గార్లు సహాయ సహకారాలను అందించారు. చివరగా బాటా అధ్యక్షురాలు శ్రీలు వెలిగేటి వందన సమర్పణ చేశారు. 'స్కోపస్ కన్సల్టింగ్' సంస్థదాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమాన్ని సక్రమంగా నడిపించటానికి బాటా కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ కొల్లి, శ్రీనివాస్ మంగిపూడి, రమేష్ కొండ, కామేష్ మల్లా, విజయ ఆసూరి, కళ్యాణ్ కట్టమూరి, యశ్వంత్ కుదరవల్లి, శిరీష బత్తుల, ఉజ్వల్ కస్తల, వీరు ఉప్పాల, కరుణ్ వెలిగేటి, ప్రసాద్ మంగిన, రవి తిరువీదుల మరియు మృత్యుంజయుడు గారలు తమ వంతు కృషి చేసారు. 'తానా, బాటా మరియు అన్నమాచార్య భావనావాహిని' అమెరికాలోని పిట్స్‌బర్గ్, డల్లాస్, న్యూజెర్సీ, షికాగో, వాషింగ్టన్ లాంటి పలు నగరాలలో అన్నమాచార్య సంకీర్తనోత్సవాలను రాబోయే కొన్ని వారాలలో నిర్వహిస్తున్నదని ప్రకటించారు